# విశాల భారతి


తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 26.10.2024 | 24 క్యారెట్లు 80,215.00 | కిలో వెండి 1,07,000.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:137

www.vishalabharati.com



## ప్రచారంపై కాకుండా శత్రువుపై దృష్టిపెట్టండి

- గొప్పలు చెప్పకోవడం మంచిది కాదు
- మోదీకి మల్లికార్జున్ ఖర్గే సలహా

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభల్లో చేస్తున్న ప్రసంగాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారాలకు ప్రధాని దూరంగా ఉంటూ శత్రువుపై దృష్టిసారించాలని సూచించారు. బెంగళూరులో ఆదివారంనాడు మీడియాతో ఖర్గే మాట్లాడుతూ,

..మిగతా 2 లో

# ఆర్థిక అసమానతలతో నక్సలిజం

- మోదీ ఫాసిస్టు శైలి పాలన
- ఆపరేషన్ కగార్ పేరిట దుశ్చర్యలు
- మావోయిస్టులతో చర్చలు జరపకుండా మారణహోమం
- చర్చలకు సిద్ధమని ప్రకటించినా చలించని ప్రధానమంత్రి
- ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సమయం ఆసన్నమైంది
- ప్రజాస్వామ్య భావాలు ఉన్న వ్యక్తులు కలిసికట్టుగా ఉద్యమించాలి :టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా చలించని ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొట్టికాయలు వేస్తే మాత్రం ఉగ్రవాదులతో చర్చలకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియాతో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు.పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు

..మిగతా 2 లో



మోదీ హయాంలో ప్రస్తుతం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఫాసిస్టు శైలిలో పాలన సాగుతోందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను తాము ముక్తకంఠంతో ఖండిస్తున్నామని... ఇది శాంతి, రాజ్యాంగం పట్ల విధ్వంసకర చర్యగా భావిస్తున్నామని అన్నారు.

## వచ్చే ఏడాది బెంగాల్ లో బీజేపీ ప్రభుత్వం

- 2026లో మమతకు తగిన గుణపాఠం
- ముస్లిం ఓట్ల కోసమే ఆపరేషన్ సిందూర్ పై విమర్శలు
- ముర్షీదాబాద్ అల్లర్లు రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతోనే జరిగాయి
- మమతపై అమిత్ షా ఫైర్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా. బుజ్జగింపు రాజకీయాల కోసమే మమతా బెనర్జీ వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తుందన్నారు. ఆపరేషన్ సిందూర్ను విమర్శించేది కూడా బంగాల్లోని ముస్లీం ఓట్ బ్యాంక్ కోసమేన్నారు. కోల్కతాలో కార్యకర్తల

..మిగతా 2 లో

## తెలంగాణ ఆతిథ్యానికి రుణపడి ఉంటా

- చౌమహల్లా ప్యాలెస్, పిల్లలమర్రి చాలా బాగున్నాయి
- బ్యూటీ విత్ పర్పస్‌కి కృషి చేస్తా
- ఈ విజయం తనకు ఎంతో సంతోషం కలిగించింది
- అవకాశం వస్తే బాలీవుడ్ సినిమాలో నటిస్తా..
- మిస్ వరల్డ్ చువాంగ్‌శ్రీ



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో ఆతిథ్యానికి రుణపడి ఉంటానని మిస్ వరల్డ్ ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ పేర్కొన్నారు. హైదరాబాద్ వేదికగా జరిగిన మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని హైదరాబాద్ హైటెక్స్ వేదికగా శనివారం జరిగిన పోటీల్లో థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్ సొంతం చేసుకున్న విషయం

..మిగతా 2 లో

## మీనాక్షితో కార్పొరేషన్ చైర్మన్ల కీలక భేటీ

- ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారు
- జిల్లాల్లో ప్రోటోకాల్ ఇవ్వడం లేదని,
- కాంగ్రెస్ బలోపేతం కోసం సూచనలు
- చైర్మన్లకు మీనాక్షి సూటి ప్రశ్న

2 లో



## జూన్ 5న కేబినెట్ సమావేశం

- రాజీవ్ యువ వికాసానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు
- పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ
- పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితా
- వాన కాలం పంటల సాగు సన్నద్ధత.. కీలక అంశాలపై చర్చ

..మిగతా 2 లో

### మాన్ సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ వెహికల్స్

## టెండర్లలో స్థానిక కాంట్రాక్టర్లకు నష్టం

- గతంలో కేవలం ఐదు నెలల కోసం టెండర్లు
- ఈసారి మూడేళ్ల కాలపరిమితికి టెండర్లు
- మీరు చొరవ చూపి స్థానికులకు న్యాయం చేయాలి
- సీఎంకి ఎమ్మెల్సీ కవిత బహిరంగ లేఖ


విశాలభారతి, స్టేట్ బ్యూరో:

జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ వెహికల్స్ టెండర్స్ వివాదంపై సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. జీహెచ్ఎంసీలోని 150 డివిజన్లలో మాన్ సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, ఇన్ స్టంట్ రిపేర్ టీమ్స్‌కు సంబంధించిన పనులు చేపట్టేందుకు పిలిచిన టెండర్లలో స్థానిక కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లుతోందని ఆమె లేఖ ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పనులు చేపట్టేందుకు గతంలో కేవలం ఐదు నెలల కోసం టెండర్లు పిలువగా, ఈసారి మూడేళ్ల కాలపరిమితికి టెండర్లు పిలిచారని పేర్కొన్నారు. ఈ పనులు చేపట్టేందుకు వినియోగించే వాహనాల్లో కొన్ని స్పెసిఫికేషన్స్ ఉండాలనే



నిబంధనలు పెట్టారు. కానీ ఆ స్పెసిఫికేషన్స్ ఉన్న వాహనాలను విక్రయించే డీలర్లు హైదరాబాద్‌లో కేవలం

..మిగతా 2 లో



# ఆర్థిక అసమానతలతో నక్సలిజం

తరువాయి భాగం

ముందుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం, మన దేశ పౌరులైన మావోయిస్టులతో చర్చలు జరపకుండా మారణహోమం ఎందుకు చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలని.. ఇదే ప్రజాస్వామ్యానికి మౌలిక సూత్రమని హితవు పలికారు. కాంగ్రెస్ అహింస పునాదులపై నిర్మితమైందని చెప్పారు. హింస ఎవరి నుంచైనా వస్తే దాన్ని తాము ఖండిస్తామని చెప్పుకొచ్చారు. గతంలో ఆర్థిక అసమానతలతో నక్సలిజం పుట్టిందని.. ఆ కాలంలో గ్రామాల్లో జరిగిన అఘాయిత్యాలు నక్సలిజం ద్వారా కొంతవరకైనా తగ్గాయని... కానీ క్రమేణ తప్పుదారి పడుతూ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యక్తిగత కక్షలు తీర్చుకునే ప్రయత్నాలకు వేదికగా మారిందని తెలిపారు మహేష్ కుమార్ గౌడ్.

ఇదే సమయంలో, నక్సలిజాన్ని నిర్మూలించేందుకు శాంతియుత పరిష్కార మార్గాలను పరిశీలించకుండా, శాంతి భద్రత సమస్యను సాకుగా చూపి మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట దుశ్చర్యలకు పాల్పడుతోందని మహేష్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. ఈ ఆపరేషన్ ద్వారా అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు.

మోదీ ప్రభుత్వంలో మతం, కులం పేరిట రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. 2014లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, మత సెంటిమెంట్‌ను సాకుగా చూపి బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో లౌకికవాద శక్తులు ఏకమవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో కమ్యూనిజం భావాలు ఉన్నవారు బలపడాలని కోరారు. దేశం మొత్తం ప్రజాస్వామ్య భావాలు ఉన్న వ్యక్తులు కలిసికట్టుగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. కేంద్రంలోని ఫాసిస్టు పాలనకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు.

# వచ్చే ఏడాది బెంగాల్ లో బీజేపీ ప్రభుత్వం

తరువాయి భాగం

సమావేశంలో పాల్గొన్న అమిత్ షా ఈ మేరకు వ్యాఖ్యానించారు. 2026తో మమతా బెనర్జీ పదవీకాలం ముగుస్తుంది బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పదవీకాలం 2026తో ముగుస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. బంగాల్లో వచ్చే ఏడాది బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన వ్యక్తులు పహల్గాం ఉగ్రదాడిలో మరణించినా నిశబ్దంగానే ఉన్నారని మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్ను విమర్శించి, మన దేశ తల్లుల, సోదరీమణులను అపహాస్యం చేస్తుందని ఆరోపించారు. అందుకే 2026లో వచ్చే ఎన్నికల్లో ఆమెకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతోనే ముర్షిదాబాద్ అల్లర్లు బంగాల్ను అక్రమ చొరబాట్లకు, మహిళలు, హిందువులపై దాడులకు అడ్డాగా మార్చిందని అమిత్ షా దుయ్యబట్టారు. బీఎస్ఎఫ్ కోసం అవసరమైన భూమిని టీఎంసీ ప్రభుత్వం ఇవ్వలేదని తెలిపారు. బీఎస్ఎఫ్కు అవసరమైన భూమిని కేటాయిస్తే అక్రమ చొరబాట్లను అడ్డుకుంటామని చెప్పారు. అక్రమ చొరబాట్ల ద్వారానే ఆ పార్టీ అధికారంలో ఉంటుందని, అందుకనే భూమిని కేటాయించడం లేదని చెప్పారు. ఇటీవల జరిగిన ముర్షిదాబాద్ అల్లర్లు రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతోనే జరిగాయని విమర్శించారు. కేంద్ర హోం శాఖ అల్లర్లను అదుపులోకి తీసుకువచ్చేందుకు బీఎస్ఎఫ్ బలగాలను మోహరించిందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.

# జూన్ 5న కేబినెట్ సమావేశం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ కేబినెట్ సమావేశం జూన్ 5వ తేదీన నిర్వహించి.. కీలక అంశాలను చర్చించాలని మంత్రుల సమావేశంలో నిర్ణయించారు. ఆదివారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్ర అవతరణ వేడుకలు, ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సదస్సులు, వాన కాలం పంటల సాగు సన్నద్ధత, రాజీవ్ యువవికాసం అంశాలపై మంత్రులు అందించిన నివేదికపై ఈ సమావేశంలో చర్చించారు. మే 29, 30 తేదీల్లో జిల్లాల్లో పర్యటించిన మంత్రులు ఈ నాలుగు అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల తుది జాబితాలు, రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లాల వారీగా తయారు చేసిన నివేదికలపై ఈ సమావేశంలో వివరించారు. రాజీవ్ యువ వికాసానికి ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, అనర్హులకు యువవికాసం అందకుండా చూడాలని పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని మంత్రులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల స్క్రీనింగ్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. మరింత లోతుగా విశ్లేషించి లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. ఒక్క అనర్హుడికి కూడా రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరవద్దని తెలిపారు. ఈ అంశంపై కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన కమిటీకి సంబంధించి అధికారులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఇప్పటికే నివేదిక అందజేశారు.

## మాన్ సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ వెహికల్స్

# టెండర్లలో స్థానిక కాంట్రాక్టర్లకు నష్టం

తరువాయి భాగం

ఇద్దరే ఉన్నారని అన్నారు. ఒక విదేశీ సంస్థకు చెందిన వాహనాలు మాత్రమే ఈ పనుల కోసం వినియోగించేలా నిబంధనలు రూపొందించారని వెల్లడించారు. ఆ సంస్థకు హైదరాబాద్ రెండు షోరూములు మాత్రమే ఉన్నాయి.. ఆ షోరూంలో నిర్వాహకులు తెలంగాణకు చెందిన కాంట్రాక్టర్లతో ఎంఓయూ చేసుకునేందుకు ససేమిరా అంటున్నారు.. తెలంగాణ కాంట్రాక్టర్లు కర్ణాటక షోరూముల డీలర్ల నుంచి ఎంవోయూలు తెచ్చుకున్నా.. వాటి ఫిజికల్ కాపీలు తక్కువ వ్యవధిలో తెచ్చి ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీలోని 150 వార్డులకు వేర్వేరుగా టెండర్లు పిలిచేవారని, ఇప్పుడు తొమ్మిది జోన్ల వారీగా మాత్రమే టెండర్లు పిలవడంతో తెలంగాణ కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. అధికారులు పేర్కొన్న స్పెసిఫికేషన్స్ కూడిన వాహనాల్లో ఒక క్యూబిక్ మీటర్ మెటీరియల్ కూడా తరలించడం సాధ్యం కాదన్నారు. గతంలో ఇందుకు వినియోగించిన వాహనాల్లో రెండు నుంచి మూడు క్యూబిక్ మీటర్ల మెటీరియల్ తరలించేవారని గుర్తుకు చేశారు. అధికారులు ఒక సంస్థకు, రెండు కాంట్రాక్టు ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చేలా నిబంధనలు మార్చడంతో ఒక్కో ఏడాదికి రూ.5.85 కోట్ల అదనపు భారం పడుతుందని తెలిపారు. కాబట్టి ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి.. గతంలో మాదిరిగా వార్డుల వారీగా టెండర్లు పిలిస్తే 150 మంది స్థానిక కాంట్రాక్టర్లకు ఉపాధి లభిస్తుందని సూచించారు.


విశాల భారతి

తెలుగు దిన పత్రిక

శనివారం,
26.10.2024
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com

vishalabharathi Telugu Daily




## ప్రచారంపై కాకుండా శత్రువుపై దృష్టిపెట్టండి

ఆయన (మోదీ) ఇచ్చే ప్రతి ప్రకటనకు తాను స్పందించాలని అనుకోవడం లేదని చెప్పారు. అయితే ఇటీవల ఆయన ఇస్తున్న బహిరంగ ప్రకటనలు, రాజకీయాల కార్యకాలాపాలను దృష్టిలో ఉంచుకుని తాను ఒక సూచన చేస్తున్నానని అన్నారు. ప్రస్తుతానికి కొంతకాలం ఆయన ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉంటూ దేశంపై దృష్టి సారించాలని అన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చామంటూ గతంలో చెప్పిన ప్రధాని మోదీ ఇప్పుడు అంతా తానే చేశానని చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సొంత గొప్పలు చెప్పుకోవడం మంచిది కాదన్నారు. దానికి బదులుగా శత్రువుపై దృష్టి సారించాలని సూచించారు. సాయుధ బలగాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఖర్గే చెప్పారు.

ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన తాజా పరిణామాలపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రతినిధి బృందం కన్సల్టేషన్స్ కోసం విదేశాలకు వెళ్లిందని చెప్పారు. వాళ్లు వచ్చేంత వరకూ ఆ వివరాలు మాట్లాడటం సరికాదని అన్నారు.

# 12 ఏండ్ల తెలంగాణం... తల్లి సోనియమ్మకి రుణం!

నిక్కచ్చిగా... నిర్ద్వంద్వంగా చెప్పాలంటే... తెలంగాణ ఆశలు, ఆకాంక్షలన్నీ నీళ్లు... నిధులు... నియామకాలు మహత్తర ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నినాదాలు. ఒక సామాజిక తెలంగాణ కావాలని... కేవలం భౌగోళిక... భౌతిక తెలంగాణ మాత్రమే కాదని కదనం నడిచింది. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో యువత, నిరుద్యోగుల పోరాటం, ఆత్మ బలిదానాలను ఆగాలన్న సదుద్దేశంతో తల్లి సోనియమ్మ తెలంగాణను ఇచ్చింది. సామాజిక తెలంగాణ సాకారం చేసి... ఆ తల్లికి తెలంగాణ సమాజం రుణం తీర్చుకోవాల్సి ఉన్నది. వెరసి, కోటి గొంతుకల తెలంగాణ... ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. ఈ ప్రాంత ప్రజల దశాబ్ధాల కల సాకారం అయింది. ఫ్రెంచ్, రష్యా, అమెరికన్, క్యుబా విప్లవాలకు సరిసమానమైన తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు తెలంగాణలోని ఒక కుటుంబానికే పరిమితం అవడం అత్యంత బాధాకరం. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు వచ్చిన కొలువులే తప్ప తెలంగాణ బిడ్డలకు ఒరిగిందేం లేదన్నది సర్వత్రా తెలిసిందే. 12 ఏండ్ల తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబానికి కరెన్సీ కట్టలు, కాసులు, కనకపు వర్షం తప్ప... ఎవరికీ ఏం రాలేదన్నదీ అక్షరసత్యం.

పదేండ్ల కారు పాలనలో కర్షకులు, కార్మికుల, కలం పట్టుకొని చదివిన విద్యార్థులు, జర్నలిస్టుల జీవితాల్లో కలవరం తప్ప మరొకటి లేకుండేది. ఆ పదేండ్ల పాలనలో పేపర్ లీకేజీలు... కోర్టు కేసులతో నిరుద్యోగ యువత ప్రాణాలతో కేసీఆర్ కుటుంబ సభ్యులు ఫుడ్ బాల్ గేమ్ ఆడారు. పిట్టల్లా యువత, విద్యార్థులు చనిపోతుంటే... అహంకారపు మాటలే తప్ప... ఎటువంటి భరోసా లభించలేదు. కేసీఆర్ నిర్లక్ష్యపు ధోరణి వల్ల, ఒక్కటి అంటే ఒక్క కాంపిటేటివ్ ఎగ్జామ్ కూడా రాయకుండానే లక్షలాది మంది ఉద్యోగ అర్హతకు అవసరమైన వయస్సును కోల్పోయిన దుస్థితి నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక, సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత నియామకాలతో తెలంగాణ అంతటా కొలువుల జాతర సాగుతున్నది. 17 నెలల కాలంలోనే దాదాపు 50 వేల మందికి పైగా కొత్త కొలువుల్లో చేరడం దేశ చరిత్రలోనే ఒక అరుదైన రికార్డు. ఇదే విషయం ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి తన ఏడాది పాలనలో 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదని ఘంటాపథంగా చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఏమాత్రం డైజెస్టు చేసుకోలేని గులాబీ దళం కుట్రలు రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువత అర్థం చేసుకోవాల్సిన అవసరం... అనివార్యత ఉన్నది.

అసలు బీఆర్ఎస్ పదేండ్ల కాలంలో ఒక్కటి అంటే ఒక్కటి కూడా గ్రూప్ 1 ఎగ్జామ్స్ నిర్వహించలేదంటే అతిశయోక్తి కాదు.... అబద్ధం అంతకంటే కాదు. సమైక్య రాష్ట్రంలో మన కొలువులన్నీ ఆంధ్రోళ్లు కొల్లగొట్టుకుపోతున్నారని నిత్యం విమర్శించిన కేసీఆర్... ఎందుకు తన హయాంలో ఒక్కసారి గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించలేదో ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి సమాధానం చెప్పాలి. ఆయన సీఎం అయిన ఎనిమిదేళ్ల తర్వాత 2022లో ఒకే ఒక్క గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. ఒకసారి పేపర్ల లీకుతో పరీక్ష రద్దు కాగా, మరోసారి బయోమెట్రిక్ విధానంపై గౌరవ హైకోర్టు ఆ పరీక్షను రద్దు చేసింది. ఆయన ఇచ్చిన నోటిఫికేషన్‌లో నిబంధనలు మీరే పాటించకపోతే ఎలా అని నాడు గౌరవ హైకోర్టు ప్రశ్నిస్తే... అసమర్థతకు నిదర్శనంగా నిలిచిన నాటి టీజీపీఎస్సీ నిబంధనలు మార్చుకోవడం తమ ఇష్టం అంటూ తలతిక్క సమాధానం ఇచ్చి ఈ రాష్ట్ర యువత జీవితాలతో ఆడుకున్నది. తన బిడ్డను నిజామాబాద్ ప్రజలు ప్రజాక్షేత్రంలో తిరస్కరిస్తే... వెంటనే మరొక పదవి అప్పగించిన పరిస్థితి కేసీఆరుకు ఉంటే... పేద బిడ్డల ఉద్యోగాల విషయంలో కేసీఆర్ కు మనసు రాకపోవడం ఆయన ద్వంద, కుటీల నీతికి నిలువెత్తు నిదర్శనం.

ఎన్నో అభ్యుదయ, అస్తిత్వ ఉద్యమాలకు కేంద్ర బిందువు ఉస్మానియా యూనివర్సిటీ వైపు తన పదేండ్ల కాలంలో కల్వకుంట్ల కుటుంబీకులు ఒక్కరూ పోలేదు. అశోక్ నగర్ అనేది ఒకటి ఉన్నదన్న విషయం మరిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందుకు తమ జాబులు పోతాయన్న నివేదికలు అందే సరికి కొంతమంది కిరాయి, పరాయి మనుషులతో నిరుద్యోగుల ముసుగులో చిట్ చాట్ నిర్వహించుకున్నారు మన ట్విట్టర్ మాస్టర్ కేటీఆర్. అయితే, అవి ఎన్నికల స్టంటులేనని తెలంగాణ ప్రజానీకం తేల్చిపడేశారు. కాగా, మాయమాటలు చెప్పడం వారికి వెన్నతో పెట్టిన... కానీ, ఎల్లకాలం మాయలు, మంత్రాలు నడవు కదా. వారి పాలనా కాలంలో గొర్రెలు ఇస్తాం... బర్రెలు ఇస్తామంటూ బడుగు బలహీన వర్గాలను శాశ్వతంగా బర్రెలు, గొర్రెల కాపర్లుగా ఉంచడానికే ప్రయత్నించిన భూస్వామ్య మనసిక వైకల్య ఎత్తులను జనాలు ఎత్తి పడేశారు. కేజీ టూ పీజీ అంటూ ఉద్యమ సమయం నుంచి ఊదరగొట్టిన కేసీఆర్ ఒక్క స్కూల్‌ను ఏర్పాటు చేయకపోగా... ఉన్న స్కూల్స్ మూసివేసిన చరిత్ర వారికున్నది. ఎందుకంటే, గడీల దొరలకు పేదలు చదవొద్దు కదా. గ్రూప్ 1, ఉపాధ్యాయ నియామకాలే కాదు... మరే జాబుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్ళలేదు. అందుకే, వారికి మొన్నటి ఎన్నికల కదన రంగంలో తెలంగాణ సమాజం మొత్తం ఒక్కటై వారిని వెనక్కి నెట్టివేసింది. ఇంటికో ఉద్యోగం అని చెప్పి... తానెప్పుడూ అలా చెప్పలేదని అసెంబ్లీలో అడ్డంగా వాదించిన చరిత్ర కేసీఆర్ కు ఉన్నది. ఇది వారి కపట, ద్వంద్వ నీతికి... అధికార, అహంకార మనస్థత్త్వానికి ఆ రెండు ప్రకటనలే నిలువెత్తు నిదర్శనం కాదా?

గత పదేండ్ల కాలంలో కరెక్టుగా చెప్పలంటే, ఒక్క ఉద్యోగం కూడా సరిగా ఇవ్వని కేసీఆర్ ప్రభుత్వం... కల్వకుంట్ల నేతలు... వారి ఉద్యోగాలు పోయేసరికి నేడు నిరుద్యోగులకు తాము అండగా ఉంటామని చెబితే... దెయ్యాలు కూడా వీరి దమననీతి చూసి సిగ్గు పడుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల వరుస నియామకపత్రాల అందజేత కార్యక్రమం, నోటిఫికేషన్ల విడుదల చేస్తుంటే... ఉక్కిరిబిక్కిరి అవుతుండటమే కాకుండా... వారి నిక్కర్లు తడుస్తున్నాయి రేవంత్ రెడ్డి పరిపాలన, రాజకీయ ఎత్తుగడలను ఎదుర్కొడం చూసి తర్వాత. యువతను రెచ్చగొడితే తమ వైపు రాష్ట్ర రాజకీయం ఉంటుందని వారు ఇంకా భావించడం వారి భావదారిద్రానికి నిదర్శనం. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతుంటే, పెట్రోల్ పోసుకొని అగ్గిపెట్టే లేదంటూ ఆడిన నాటకంతో అనేక మంది నిప్పుపెట్టుకొని చనిపోయిన దుస్థితి. నేడు తెలంగాణ 12 ఏండ్ల వయస్సు కల్గిన రాష్ట్రం నేడు సామాజికంగా... రాజకీయంగా... ఆర్థికంగా... సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందంటే... కేవలం మన కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే అన్న విషయం తెలంగాణ సమాజం గుర్తెరగాలి.




బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్,
అధ్యక్షులు, టీపీసీసీ,
శాసనమండలి సభ్యులు.


# తెలంగాణ ఆతిథ్యానికి రుణపడి ఉంటా

తరువాయి భాగం



తెలిసిందే. 72వ మిస్ వరల్డ్ గెలిచిన ఈ థాయ్ సుందరి మాట్లాడుతూ.. ఈ విజయం తనకు ఎంతో సంతోషం కలిగించిందని చెప్పింది. బ్యూటీ విత్ పర్పస్‌ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొంది. తెలంగాణలో సోషల్ సర్వీస్ చేయనున్నట్లు పేర్కొంది. మిస్ వరల్డ్ కిరీటం అందుకునే సమయంలో భావోద్వేగానికి గురయ్యానని.. అదే సమయంలో షాక్‌కు గురయ్యానని చెప్పింది. పోటీల్లో తాను మాత్రమే విజేతను కానని.. పోటీదారులంతా తన దృష్టిలో విజేతలేనని చెప్పింది. ఇక్కడ మొదలైన తన ప్రయాణం చాలా అద్భుతమని.. ఈ జర్నీలో చాలా విషయాలు నేర్చుకున్నానని చెప్పింది. తెలంగాణ ప్రజలు గౌరవ ఆతిథ్యం ఇచ్చారని.. వారిని మరిచిపోలేనని చెప్పింది. తెలంగాణ టూరిజాన్ని ప్రమోటం చేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని చెప్పింది. మిస్ వరల్డ్ కావాలన్న తన కల నెరవేరిందని చెప్పింది. హైదరాబాద్ అంటే తనకు ఇష్టమని, తెలంగాణ ఆతిథ్యం బాగుందని చెప్పింది. చౌమహల్లా ప్యాలెస్, పిల్లలమర్రి చాలా బాగున్నాయని.. ఓపల్ ఫర్ హర్ ప్రాజెక్టు కోసం మరింత కృషి చేస్తానని చెప్పుకొచ్చింది. సందర్భంగా భారీయ చిత్రాలు, నటీనటుల గురించి సైతం థాయ్ సుందరి మాట్లాడింది. భారత్ నుంచి మిస్ వరల్డ్‌గా విజయాన్ని అందుకున్న వారిలో ఎవరంటే ఇష్టం అని మీడియా ప్రశ్నించగా.. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టమేనని చెప్పింది. తనకు ఇష్టమైన మానుషి చిల్లర్‌ను ఫైనల్‌లో కలిశానని.. అలాగే, తనకు ప్రియాంక చోప్రా సైతం ఇష్టమేనని చెప్పింది. ఆమె నుంచే తాను స్ఫూర్తి పొందానని.. తనకు వీలున్న సమయంలో సినిమాలు చూస్తానని తెలిపింది. పలు బాలీవుడ్ సినిమాలు చూస్తానని.. తనకు అలియాభట్ తెలుసునని చెప్పింది. అలియా నటించిన గంగూబాయి కథియావాడి నాకెంతో నచ్చిందని.. అది మూవీ ప్రేక్షకులను ఆలోచింప చేసేలా ఉందని చెప్పింది.

అయితే, బాహుబలి మూవీ గురించి విన్నానని.. ఆ మూవీ చూడలేదని పేర్కొంది. పోటీలు పూర్తయ్యాక ఆ మూవీని చూడాలని నాకు నేనే ఒట్టు వేసుకున్నానని.. మళ్లీ ఇక్కడికి వచ్చే నాటికి తప్పకుండా ఆ మూవీపై రివ్యూ ఇస్తానని చెప్పింది. అవకాశం వస్తే బాలీవుడ్ సినిమాలో నటిస్తానని.. అదే నాకు ఓ మంచి అవకాశం అవుతుందని చెప్పుకొచ్చింది. మిస్ వరల్డ్ కిరీటం గెలువడం తన జీవితంలో అద్భుతమైన రోజని.. వ్యక్తిగతంగానే కాకుండా థాయ్‌లాండ్ ప్రజలకు మైలురాయిగా అభివర్ణించింది. ఈ విషయంలో తాను గర్వపడుతున్నానని.. మిస్ వరల్డ్ వేదికపై తమ దేశానికి గుర్తింపు లభించిందని పేర్కొంది

# మీనాక్షితో కార్పొరేషన్ చైర్మన్ల కీలక భేటీ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్ల సమావేశం ఆదివారం గాంధీభవన్‌లో జరిగింది. ఇన్‌చార్జ్ మీనాక్షికి కార్పొరేషన్ చైర్మన్లు పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. జిల్లాల్లో ప్రోటోకాల్ ఇవ్వడం లేదని, ప్రభుత్వ కార్యక్రమాల్లో తమను కలుపుకుపోవడం లేదని ఫిర్యాదు చేశారు. రివ్యూల పేరుతో డిపార్ట్‌మెంట్ ఎండీలతో మాట్లాడుతున్నారే తప్పా కార్పొరేషన్ తమను సంప్రదించడం లేదని కార్పొరేషన్ చైర్మన్లు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున టీటీడీ లెటర్స్‌లో కూడా కార్పొరేషన్ చైర్మన్లకు ప్రోటోకాల్ వచ్చేలా చూడాలని విన్నవించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై ఈ సమావేశం జరిగిందని గ్రంథాలయ చైర్మన్ రియాజ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారనే విషయంపై మీనాక్షి నటరాజన్ ఆరా తీశారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలపైన ఎలా ముందుకెళ్లాలనే విషయంపై కార్పొరేషన్ చైర్మన్లను మీనాక్షి నటరాజన్ అడిగారని అన్నారు. కార్పొరేషన్ ద్వారా ప్రజల్లోకి పథకాలను ఏ విధంగా తీసుకెళ్తున్నారని అడిగారని చెప్పారు. తాము ప్రజల్లోకి పార్టీని, పథకాలను ఎలా తీసుకెళ్తున్నామనే విషయాన్ని వివరించామని తెలిపారు. కాంగ్రెస్ బలోపేతం కోసం తాము సూచనలు చేశామని అన్నారు. ఇలాంటి సమావేశాలు మరిన్ని జరగాలని కార్పొరేషన్ చైర్మన్లు కోరారని తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మీనాక్షి నటరాజన్ నోట్ చేసుకున్నారని చెప్పారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి సమానంగా తమకు ప్రోటోకాల్ ఇవ్వాలని కోరామని.. ఈ విషయాన్ని మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లామని గ్రంథాలయ చైర్మన్ రియాజ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపై కార్పొరేషన్ చైర్మన్లతో మీనాక్షి నటరాజన్ చర్చించారని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి తెలిపారు. పలు సమస్యల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారని అన్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్‌ని బలోపేతం చేసిన, జెండాను మోసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గౌరవం ఉంటుందని మీనాక్షి నటరాజన్ హామీ ఇచ్చారని చెప్పారు. స్థానిక సంస్థల్లో కష్టపడ్డ వారికి అవకాశం ఇస్తామని తమతో మీనాక్షి నటరాజన్ అన్నారని మెట్టు సాయి పేర్కొన్నారు.

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఎంపీ మల్లు రవి బాధ్యతలు స్వీకరించారు. గాంధీ భవన్‌లో చిన్నారెడ్డి నుంచి మల్లు రవి బాధ్యతలు తీసుకున్నారు. భారీ ఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మల్లు రవికి స్వాగతం పలికారు. బాణసంచా కాలుస్తూ, నృత్యాలు చేస్తూ సంబురాలు చేశారు. పార్టీలో స్వేచ్ఛ ఉంటుంది, కానీ లక్ష్మణ రేఖ దాటవద్దని క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి తెలిపారు. తాను కాంగ్రెస్ పార్టీ వల్ల మూడుసార్లు ఎంపీ అయ్యానని, ఒకసారి ఎమ్మెల్యే, రెండు సార్లు ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధిని అయ్యానని గుర్తుచేశారు. పార్టీలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియమించడం తనకు ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఉంటుందని అన్నారు. నాలుగు గోడల మధ్య నేతలు అభిప్రాయాలను తెలపాలని సూచించారు. ఎలాంటి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని, క్రమశిక్షణ గీత దాటొద్దని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు.

## తెలంగాణలో ఐదురోజులు మోస్తరు వానలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:తెలంగాణలో రాగల ఐదురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షా లు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షా లు కురుస్తాయని పేర్కొంది. సోమవారం నుంచి గురువారం వరకు పలు జిల్లాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వరకు ఈదురుగాలులు వీస్తాయని.. పలుచోట్ల ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఈ నెల 6న కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షా లు వీచే అవకాశాలున్నాయని వివరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

GENERAL NEWS



## దాసరి రాహుల్ ప్రదీప్ ఆధ్వర్యంలో ఘనంగా చిరుమూర్తి రాజు జన్మదిన వేడుకలు

**కూకట్ పల్లి,విశాలభారతి:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు పుట్టినరోజు సందర్భంగా కూకట్ పల్లి భాగ్యనగర్ కాలనీ లో దాసరి రాహుల్ ప్రదీప్ కార్యాలయంలో చిరుమర్తి రాజు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాహుల్ ప్రదీప్ మిత్ర బృందం శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు భవిష్యత్తులో రాజకీయంగా మరింత ఎదగాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ బిసి ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు జి బ్రహ్మేంద్రరావు, ఆకుల వీర స్వామి, విలేకరులు మహేష్, నవీన్ గౌడ్, అర్జున్, మారుతి సాగర్, అనిల్, సత్య, సైదులు తదితరులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## కార్పొరేటర్ కి కృతజ్ఞతలు తెలిపిన కాలనీ వాసులు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్ నగర్ డివిజన్ లోని మహా గాయత్రి నగర్ లో దీర్ఘకాలికంగా ఉన్న సిసి రోడ్ల సమస్యను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిష్కరించడంతో, మహా గాయత్రి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం కార్పొరేటర్ ని వారి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్ అభివృద్ధి చేయడం తన యొక్క బాధ్యతని, రానున్న రోజుల్లో కూడా హయత్ నగర్ డివిజన్ మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు దేవ్ సింగ్ ,ప్రధాన కార్యదర్శి లింగం ,ఉపాధ్యక్షులు చుక్కా రెడ్డి , ఉపాధ్యక్షులు భగవంత్ గౌడ్ , కోశాధికారి మధు, కమిటీ పెద్దలు రమేష్ , వేణుగోపాల్ రెడ్డి తో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ పాల దినోత్సవం

- పాడి రైతుల శ్రేయస్సుకి, వినియోగదారుల ఆరోగ్యం కోసం కృషి చేయాలి.
- చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి



**విశాలభారతి, ఓయూ:**

తెలంగాణ విజయ డైరీ అధికారులు, ఉద్యోగులు పాడి రైతుల శ్రేయస్సు కోసం, వినియోగదారుల ఆరోగ్య సంరక్షణ కై కృషి చేయాలని విజయ తెలంగాణ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి అన్నారు.ఆదివారం విజయ డైరీ లో 25వ,అంతర్జాతీయ పాల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అంతకుముందు డెయిరీ ఎండీ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా సేల్ఫీ స్టాండ్ ను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా సంస్థ ద్వారా తయారీ చేసిన డిటియం పెరుగు, శుభోదయం చిన్న నెయ్యి ఫ్యాకేట్స్ ను మార్కెట్ లోకి వారు విడుదల చేశారు.అనంతరం ఎల్బీనగర్ లోని అనాథ విద్యార్థి గృహంలో విద్యార్థులకు విజయ పాల ఉత్పత్తులు అందజేశారు. అనాథ విద్యార్థులు పట్టుదల క్రమశిక్షణలో జీవితంలో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థి గృహం నిర్వాహకులు మార్గం రాజేష్ ను అమిత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో జీఎం లు మల్లయ్య, కవిత, మల్లికార్జున్,మధు సుధన్ తో పాటుగా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు మహాసభ కార్యవర్గ సభ్యునిగా చేపూరి వెంకటేశ్వరరావు నియామకం



**సికింద్రాబాద్, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ కార్యవర్గ సభ్యులను ఆదివారం జరిగిన సమావేశంలో నియమించారు. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన చేపూరి వెంకటేశ్వర రావును కార్యవర్గ సభ్యునిగా నియమించారు.ఈ మేరకు అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు నియామక పత్రాన్ని చేపూరి కి అందజేశారు. కాగా అధ్యక్షుడు తో పాటు 29 మంది కార్యవర్గ సభ్యులను ఈ సమావేశంలో ఎన్నుకున్నారు. మిగతా పూర్తి బాడీని వారం, పది రోజుల్లో నియమించను నట్లు చేపూరి వెంకటేశ్వరరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అభివృద్ధికి తన సహాయ, సహకారాలు అందిస్తాన ని చేపూరి తెలిపారు.

## కాంగ్రెస్ సర్కార్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తుంది

- కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



**కూకట్ పల్లి, విశాలభారతి:**

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహాన్ని ఇస్తుందని ఇందుకు అవసరమైన వ్యయం ఎంతైనా భరించేందుకు సిద్ధంగా ఉందని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. నేషనల్ ఓపెన్ కరాటే టోర్నమెంట్ పోటీలు ఆదివారం కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో బాకీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండి రమేష్ హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు పురుషులను లేకుండా ప్రతి ఒక్కరికి ఆత్మ రక్షణ కోసం దృఢంగా ఉండాలని దీనికోసం ఆటలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అందులో ప్రత్యేకంగా కరాటే ఆత్మ రక్షణతో పాటు శారీరకంగా మానసికంగా వ్యక్తికి ఎంతో ధైర్యాన్ని ఇస్తుందన్నారు. అంతేకాకుండా క్రీడలు వ్యక్తుల మధ్య సత్సంబంధాలను పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయన్నారు.అలాగే దేశాల మధ్య వారధిగా కూడా క్రీడలు దోహదపడతాయన్నారు. రాష్ట్రంలో ఆటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందన్నారు. ఇందుకోసం నిధులు సైతం విరివిగా ఖర్చు పెడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పుష్ప రెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నా ఏది నీ గౌరవం? ఏంటి ఈ ఘోరం?

పంటకి మద్దతు ధర లేదు.. వస్త్రధారనకి గౌరవం లేదు.. పెళ్లికి అంగీకారం లేదు.. చివరికి ప్రాణానికి విలువ లేదు!

మట్టిపై మమకారంతో జీవితాంతం బ్రతికే రైతు చివరికి ఆ మట్టిలో కలిసే దాకా అయినా ఆత్మగౌరవంతో బ్రతికేలా చేయడం అందరి బాధ్యత

రైతన్నా ఏది నీ గౌరవం? ఏంటి ఈ ఘోరం?

రైతన్నా ఏది నీ గౌరవం? ఏంటి ఈ ఘోరం?



- స్వేదాన్ని ఆయుధంగా మార్చి శ్రమను పెట్టుబడిగా మలిచి సేద్యం అనే యుద్ధంలో నిత్య శ్రామికుడిగా పోరాడుతూ అందరి ఆకలిని తీర్చే అన్నదాతల పట్ల ఈ వ్యవస్థల వైఖరి ఏంటి?
- రైతు ఉనికే ఈ దేశానికి ధైర్యం.
- రైతు చేతిలో పుట్టిన విత్తనమే ఈ దేశానికి ప్రాణం.
- రైతు చేతితో తడిసిన నేలే ఈ దేశానికి అన్నపూర్ణ.
- కానీ ప్రస్తుత సమాజం రైతును చూసే కోణం మాత్రం చాలా దారుణంగా ఉంటుంది ఇది నేటి సమాజపు మానసిక వైకల్యానికి నిదర్శనంగా మారుతుంది .

**తడిసిన వడ్ల కోసం తహసీల్దార్ కాళ్లు మొక్కాల్సిన దుస్థితిలో నేటి రైతులు:**

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తెలంగాణ రాష్ట్రంలో చాలా జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాలలో వడ్లు తడిసి మొలకెత్తిన సంఘటనలు చాలా చోట్ల జరిగాయి, చాలా రోజులుగా వడ్లు కొనుగోలు కేంద్రాలలోనే ఉండడం ఈ దుస్థితికి కారణం ఇలాంటి పరిస్థితులలో వడ్లను కొనాలని మహబూబాబాద్ లో మహిళా రైతులు అధికారాల కాళ్లు మొక్కడం రైతుల ఆత్మగౌరవానికి ఆటంకంగా మారింది , ఇలాంటి పరిస్థితులు రైతులకు నిత్యం ఎక్కడో అక్కడ ఎదురవుతూనే ఉన్నాయి ఇది రైతుల పట్ల ప్రభుత్వాల వైఖరికి నిదర్శనంగా నిలుస్తాయి ఇలాటివి పార్టీలతో సంబంధం లేకుండా ఏ పార్టీ అధికారంలో ఉన్నా జరగడం ఆమోదించతగినది కాదు

**వేషధారణ చూసి వెక్కిరించే పరిస్థితి:**

ఆ మధ్య కాలంలో కర్ణాటకాలో రైతు పంచ కట్టుకొని ఉన్నాడని , బట్టలు మాసి పోయి ఉన్నాయయని మెట్రో రైలులోకి అనుమతించలేదు, అలాగే మరో రైతును షాపింగ్ మాల్ లోని ధియేటర్ లోకి అనుమతించలేదు. ఈ సంఘటనలు దేశవ్యాప్తంగా నిత్యం ఎక్కడో అక్కడ జరుగుతూనే ఉన్నాయి ఇవి రైతుల పట్ల సమాజ వైఖరిని తెలుపుతున్నాయి, దేశానికే గర్వకారణమైన అన్నదాతను అగౌరవపరచడం వ్యవస్థ వినాశనానికి దారి తీస్తుంది

**యువ రైతులకు పెళ్లి కలగానే మిగులుతోంది :**

ఇటీవల కాలంలో వ్యవసాయం చేసే చాలా మంది యువకులకు పెళ్ళిళ్లు కావడం కష్టంగా మారింది వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగించే యువతకు పెళ్లికి అమ్మాయిని ఇవ్వడానికి చాలా మంది అమ్మాయి తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు, కారణం ఉద్యోగ భద్రత లేదని, స్థిరమైన ఆదాయం లేదని అమ్మాయిల తల్లిదండ్రులు తిరస్కరిస్తున్నారు. ఇది కేవలం ఒకరి వ్యక్తిగత బాధ కాదు, వ్యవసాయ రంగాన్ని చిన్నచూపు చూసే సమాజపు ఆలోచనా ధోరణికి ఇది నిదర్శనం

ఎంత గొప్ప ఉద్యోగం చేసేవాడు అయినా సంపాదించిదంతా చివరికి భూమిపైనే పెట్టుబడి పెడుతున్నాడు, వారి కోసం పిల్లనివ్వడానికి పోటీ పడుతుంటారు, అదే భూమిని నమ్ముకునే జీవితాన్ని సాగించే రైతులకు మాత్రం పిల్లనివ్వడానికి వెనకడుగు వేస్తున్నారు ఇదే ఈ సమాజపు వింత పోకడ..

**మద్దతు ధరలు లేవు ,అప్పులు పెరిగాయి, చివరికి రైతుల ఆత్మహత్యలే మిగిలాయి**

పంటలకు పెట్టుబడులు పెరిగాయి, దిగుబడులు తగ్గాయి, వచ్చిన పంటకు మద్దతు ధరలు లేకపోవడం, వంటి అనేక సమస్యల వలన రైతు అప్పుల ఊబిలో చిక్కుకుపోయి చివరకు ఆత్మహత్యే శరణ్యంగా భావిస్తున్నాడు, ఇది రైతుల పట్ల ప్రభుత్వాల వైఖరికి అద్దం పడుతుంది

రాజకీయ వేదికలపై 'రైతేరాజు' అనే మాటలు కాదు క్షేత్ర స్థాయిలో రైతులకు అండగా నిలవడం కావాలి , నాయకుల ఉపన్యాసాలలో రైతును గౌరవించడం కాదు దేశం గర్వ పడేలా రైతును ఆర్థికంగా అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీ, నాయకుల పై ఉంది

**పంట రైతుది, లాభం దళారులది**

ఎంతో కష్టపడి రైతు పంటను పండిస్తే ఆ పంటలు చివరికి రైతుకు నష్టాన్ని, దళారులకు లాభాలను తెచ్చి పెడుతున్నాయి కారణం ,

మార్కెట్ సిండికేట్ అని, కమిషన్ అని, నాణ్యత బాగోలేదని, రేట్ తగ్గువ ఉంది అని రైతులను భయబ్రాంతులకు గురిచేసి కొంత మంది దళారులు రైతుల దగ్గర తక్కువకు కొని మార్కెట్ లో ఎక్కువ ధరలకు అమ్ముకొని లాభాలను పొందుతున్నారు ఇది రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నది , ప్రభుత్వాలకు వీటిపై నియంత్రణ లేకపోవడం కూడా వీటికి ప్రధాన కారణం

**రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు చేపట్టవలసిన అత్యవసర చర్యలు:**

- రైతును రాజుగా మార్చడం అటుంచి కనీసం రైతును ఆత్మగౌరవంతో బ్రతికేలా చేయడం అందరి బాధ్యత
- రైతును రాజకీయ పార్టీలు చూడాల్సింది ఓటు బ్యాంకు లా కాదు బ్యాంకులో దాచుకున్న విలువైన సంపదలా ..
- మద్దతు ధరలు ఖచ్చితంగా అమలు చేయాలి. కనీస లాభంతోపాటు
- స్థిరమైన ధరలను నిర్దేశించాలి.
- రైతులే నేరుగా వారి ఉత్పత్తులను అమ్ముకునే వీలు కల్పించాలి, దానికి తగినట్టుగా సమీపంలోనే మార్కెట్ యార్డ్స్ నీ నిర్మించాలి
- వ్యవసాయంలో పంటలకు, రైతులకు బీమా పూర్తి స్థాయిలో అమలవాలి. బీమా మొత్తం రైతుకు , రైతు కుటుంబ సభ్యులకు స్వయంగా, సమయానికి చెల్లించాలి.
- తడిసిన ధాన్యాలను, ప్రభుత్వం మద్దతు ధర తో పాటే కోనుగోలు చేయాలి
- పెట్టుబడి సబ్సిడీలు నేరుగా రైతుల ఖాతాల్లోకి వేగంగా చెల్లించాలి.
- రైతు కుటుంబాలకు ఆరోగ్య, విద్య భరోసా పథకాలను సమర్థంగా అమలు చేయాలి.
- రైతుల సమస్యలను రాజకీయ ప్రసంగాలకే పరిమితం చేయకుండా అమలులో కృషి చేయాలి
- రైతులతో నేరుగా భేటీ అయి వారి సమస్యలపై ప్రణాళిక బద్ధమైన నివేదికలను తయారు చేసి, అసెంబ్లీలో, పార్లమెంటు లో చర్చించాలి.
- కౌలు రైతులకు పింఛన్లు అందించడం , వృద్ధ రైతులకు ఆర్థిక భరోసాని కల్పించడం చేయాలి
- వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి, వ్యవసాయంలో పెట్టుబడులను, సాంకేతికతను ప్రోత్సహించాలి, దానికి లాభసాటిగా మార్చాలి
- రైతు ప్రాణం చాలా విలువైనది రైతును కాపాడుకుంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది .*రైతును గౌరవించడం , రైతును ఆత్మగౌరవంతో జీవించేలా చేయడం మన అందరీ బాధ్యత .

**రైతు ఆత్మగౌరవమే దేశానికి ఆభరణం***
**అన్నదాతల ఆత్మహత్యారహిత భారతాన్ని నిర్మించాలి అదే అసలైన దేశాభివృద్ధి**



జి. అజయ్ కుమార్
సామాజిక విశ్లేషకులు

**ఆటో అదుపుతప్పి ముగ్గురికి స్వల్ప గాయాలు**

**విశాలభారతి,భీమదేవరపల్లి :**

మండలంలోని కొత్తకొండ సబ్ స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం ఆటో ఒకటి అదుపుతప్పి పల్టీలు కొట్టిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ముత్తారం గ్రామానికి చెందిన తరుణ్ (22) తీవ్రంగా గాయపడి కాలి ఫ్రాక్చర్ అయ్యింది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం, ప్రయాణికులతో వెళ్తున్న ఆటో కొత్త కొండ సబ్ స్టేషన్ మలుపు వద్ద మిగతా వాహనాలను తప్పించబోయే ప్రయత్నంలో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడగా, తరుణ్‌కు మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. తక్షణమే అతడిని వరంగల్ ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



# పరిమళించిన స్నేహబంధం

**తొర్రూరు,విశాలభారతి:**



పరిమళించిన స్నేహబంధం సాహితి హై స్కూల్ 200506 బ్యాచ్ కి చెందిన విద్యార్థులు ఒక వాట్సప్ గ్రూపుగా ఏర్పడి తమ గ్రూపులోని తోటి స్నేహితులకి ఆపదలో ఆదుకునే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకొని పూర్వ విద్యార్థుల ఆత్మీయ భరోసా అనే కార్యక్రమాన్ని చేపట్టి స్నేహితుల కుటుంబాలలో వెలుగును నింపుతూ వారికి ఆర్థిక భరోసానిస్తూ ఏర్పడిన అనతి, కాలంలోనే స్నేహితులకు చేదోడు, వాదోడుగా ఉంటూ పరువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.ఈ కార్యక్రమం భవిష్యత్ కాలంలో కూడా నిలుస్తుందని మా స్నేహబంధం ఇలాగే కొనసాగుతుందని వారి యొక్క అభిప్రాయాలు తెలిపారు.




## సీసీ కెమెరాల ఏర్పాటుతో
# నేరాలు అరికట్టవచ్చు

- **చెన్నంపల్లి గ్రామానికి సీసీ కెమెరాలు అందించిన విక్రమ్ రెడ్డి**
- **అభినందించిన గ్రామస్థులు**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టే అవకాశం ఉందని అమన్గల్ ఎస్ఐ వెంకటేష్ అన్నారు. మండలంలోని చెన్నంపల్లి (మాలపల్లి ) గ్రామ పంచాయతీకి గ్రామ యువనాయకుడు కళ్ళు విక్రమ్ రెడ్డి గ్రామానికి సరిపడు సీసీ కెమెరాలను పోలీసులకు ఆదివారం అందించారు. సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసుల తో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారులు బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన విక్రమ్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. గ్రామ యువకులు , ప్రజలు విక్రమ్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ ,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అధ్యక్షుడు రవికుమార్, రమణ, తిరుపతయ్య, విజేందర్ ,శ్రీధర్ ,జంతిక కృష్ణ, శ్రీకాంత్ ,గడుసు మహేష్ ,రాఘువేందర్ తదితరులు పాల్గొన్నారు.




## అహల్యాబాయి హోల్కర్ పాలనకు
# సమాజ సేవకు ప్రతీక

- **బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్,వడ్డేపల్లి రాజేశ్వరరావు.**

**కూకట్ పల్లి,విశాలభారతి :**

అహల్యాబాయి హోల్కర్ జయంతిని పురస్కరించుకొని బాలానగర్ డివిజన్‌లో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ ఈటెల రాజేందర్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఎస్.మల్లారెడ్డి పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ అహల్యాబాయి హోల్కర్ మంచి పాలనకు సమాజ సేవకు ధార్మికతకు ప్రతీక అని,నేటి యువత ఆమె జీవితం నుంచి ఎంతో నేర్చుకోవాలి వారు సూచించారు. దేశానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.ఈ వేడుకలు అహల్యాబాయి హోల్కర్ మహోన్నత సేవలను స్మరించుకోవడమే కాకుండా, సమాజంలో సదాచారాన్ని ప్రోత్సహించే దిశగా కీలకంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు కార్యకర్తలు,పలువురు విద్యార్థులు, యువత, స్థానిక నాయకులు,సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న జీలుగా విత్తనాలు పట్టివేత


- **మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకర్**

**తొర్రూరు,విశాలభారతి:**



జీలుగు విత్తనాలను అక్రమంగా ఆంధ్రకు తరలిస్తుండగా పోలీసులు సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కెకన్ తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు పట్టణంకు చెందిన చదలవాడ ఉపేందర్ అక్రమంగా జిలుగు విత్తనాల బస్తాలు జనగాం జిల్లా, తరిగొప్పుల మండల ఆగ్రో రైతు సేవ కేంద్రం సురేష్, బచ్చన్నపేట ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం శ్రీనివాస్ రెడ్డి,ఇద్దరి దగ్గర నుండి అక్రమంగా జీలుగు విత్తనాల బస్తాలు తక్కువ ధరకు కొనుగోలు చేసి జనగామ నుండి ఆంధ్రాకు తరలించే క్రమంలో,ఆదివారం తెల్లవారుజామున విశ్వసనీయ సమాచారం మేరకు తొర్రూరు పోలీసులు ఉపేందర్ నివాసంలో విత్తనాల బస్తాలు మారుస్తున్న సమయంలో దాడి చేసి,విత్తన బస్తాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. పట్టుబడిన విత్తనాలు సుమారుగా 106 బస్తాలు ఉండగా,ఒక్కో బస్తా 60 కిలోల బరువు కలిగి ఉంది. మొత్తం విలువ సుమారుగా రూ. 4.75 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ దాడులలో రెండు బులొర వాహనాలు,మొబైల్ ఫోన్ స్వాధీన చేసుకున్నామని తెలిపారు. మొత్తం ఐదు గురుపై కేసు నమోదు చేశామని ఆంధ్రకు చెందిన శేషాద్రి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిపారు రైతులకు నష్టాన్ని కలిగించే అక్రమ విత్తనాల సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించం,అని హెచ్చరించారు. వ్యవసాయాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలకూ అవకాశం ఇవ్వమని ఆయన స్పష్టం చేశారు.అక్రమ విత్తనాల వ్యాపారాన్ని నియంత్రించేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డిఎస్పి తిరుపతిరావు,సిఐ గణేష్,ఎడిఎ విజయ చంద్ర,ఎస్సైలు, ఉపేందర్,రాజు,రమేష్,క్రాంతి కిరణ్,ఎఓ రాంనరసయ్య, ఎఇఓలు భారత్,వినయ్, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.





# మహిళ మెడలో మంగళసూత్రం చోరీ

- **మూడు తులాల బంగారం కొట్టేసిన దొంగ**
- **ఇబ్రహీంపట్నంలో ఘటన, కేసు నమోదు**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

మహిళ మెడలో నుంచి ఓ దుండగుడు మూడు తులాల బంగారు గొలుసు (మంగళసూత్రం) చోరీ చేసిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన మాదారమోని లక్ష్మమ్మ (70), భర్త నర్సింహా ఇబ్రహీంపట్నం కూరగాయల మార్కెట్ లో ఆకుకూరలు అమ్ముతూ జీవనం సాగిస్తుంది. ఎప్పటిలాగానే ఆదివారం ఉదయం ఆకుకూరలు విక్రయించి బస్టాండ్ కు బయలుదేరింది. ఆమె నడుచుకుంటూ వెళ్లే క్రమంలో ఓ దుండగుడు ఆమెను ఫాలో అవుతూ ఆమె మెడలోంచి సుమారు 3 తులాల బంగారు గొలుసు చోరీ చేసి కారులో పారిపోయాడు. కాగా బాధితులు లబోదిబోమని అరిచిన ప్రయోజనం లేకపోయింది. బాధితులు ఈ ఘటన పై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

**ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసిపి**

చోరీ జరిగిన స్థలాన్ని ఇబ్రహీంపట్నం ఏసిపి రాజు , సీఐ జగదీష్ పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగను పట్టుకుంటామని చెప్పారు.



# అంగరంగ వైభోగంగా కళ్యాణ మహోత్సవం

- **గౌరారం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మార్కమ్మ , ఎల్లమ్మ ఆలయాలు నిర్మాణం**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**

రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మల్కీజ్ గూడలో మండల మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరారం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామదేవతలు మార్కమ్మ, ఎల్లమ్మ ఆలయాలు నిర్మించారు. ఆదివారం మార్కమ్మ, ఎల్లమ్మ దేవతల కల్యాణోత్సవం నిర్వహించారు. మార్కమ్మ కళ్యాణోత్సవంలో గౌరారం రామ్ రెడ్డి అనసూయ దంపతులు, ఎల్లమ్మ కల్యాణోత్సవంలో గౌరారం వెంకట్ రెడ్డి సరిత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి దేవతా మూర్తుల కాళ్లు కడిగారు. రానున్న రోజుల్లో ఇతర దేవతా మూర్తుల ఆలయాల నిర్మాణానికి సన్నాహాలు చేపడుతున్నామని త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు వెంకటరెడ్డి తెలిపారు. దేవతామూర్తుల అనుగ్రహంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు ప్రజలు పెద్ద పాల్గొన్నారు.



## ఉత్తమ ఫలితాలు సాధించిన
# విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

- **ముఖ్య అతిథులుగా డిఆర్వో వెంకటాచారి హాజరు**
- **బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు అందజేత**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**

ఎస్ఎస్ఎస్సి,ఇంటర్మీడియట్, ఎంసెట్ 2025 ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ విద్యార్థులకు కేఎంఆర్ గార్డెన్ లో ప్రథమ, ద్వితీయ బహుమతులను బూడిద రాంరెడ్డి ఫౌండేషన్ (బిఆర్ఆర్) చైర్మన్ బూడిద రాంరెడ్డి అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఆర్వో వెంకటాచారి , ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఏడుకొండలు ,ద మిషన్ ఫౌండర్ ఆఫ్ చైర్మన్ , ఎక్సైజ్ సీఐ హాజరై విద్యార్థులకు తమ నిజ జీవితంలో ఎదుర్కొన్న కష్టసుఖాలు కూలంకషంగా వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 60 మందికి ప్రథమ బహుమతి , 60 మందికి ద్వితీయ బహుమతులు అందించారు. విద్యార్థులు నగదు పురస్కారాలు, జ్ఞాపికలు అందించి శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ వెంకటాచారి మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డు కాదని ప్రతి ఒక్క విద్యార్థి ఈ విషయాన్ని తెలుసుకొని కష్టపడి అభివృద్ధిలోకి రావాలని అన్నారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను విద్యార్థులకు ఉదాహరణగా వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూడిద నరసింహ రెడ్డి, రాయపోల్ మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి జ్యోతి భాస్కర్ రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభం

- **తులేకలాన్ లో ముగ్గుపోసిన కాంగ్రెస్ నాయకుడు కోడూరి రమేష్**

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో కలిసి ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరు రమేష్ ఆదివారం ఇళ్ల నిర్మాణాలకు ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తులేకలాన్ గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పరచి నిర్మాణ విధానాన్ని తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ .. ఇంటి నిర్మాణానికి విడతల వారీగా నిధులు మంజూరవుతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహ, దాసు , వెంకటేష్ , యాదయ్య , పాండు గ్రామస్థులు , తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నాళ్ళ కెన్నాళ్లకో..15 ఏండ్లకు. పూర్వ విద్యార్థుల..అపూర్వ ఆత్మీయ సమ్మేళనం

ఆర్మూర్,విశాలభారతి:

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్ర శివారులోని మైత్రి గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఎన్నాళ్ళ.. కెన్నాళ్లకో...

అన్నట్లుగా 15 ఏండ్లకు... జక్రాన్ పల్లి మండలం అర్గుల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 20092010 పదవ తరగతి పూర్వ విద్యార్థులందరూ అపూర్వ మధురాను భూతులతో ఆత్మీయంగా సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఎవరు ఏం చేస్తున్నారని, వారి వారి పిల్లల, వారి కుటుంబాల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 15 సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులందరూ వారి పాఠశాల మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ, చదువుకునే సమయంలో జోకులు వేసుకుని నవ్వుకున్నక్షణాలను, తరగతి గదిలో బోధించిన పాఠాలు బోర్ కొట్టిన జ్ఞాపకాలను, తరగతి గదుల్లో నిద్రపోయిన రోజులను, బెంచీల కింద పడుకున్న దినాలను, క్లాసులు ఎగ్గొట్టిన రోజులను, పరీక్షలకు ముందు రాత్రంతా చదువుకున్న తీపి గుర్తులను ఒకరికొకరు పూర్వ విద్యార్థులందరూ నెమరు వేసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ గురువులందరిని సంబురంగా సన్మానించుకున్నారు. తరువాత 15 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులందరూ స్టేజిపై చేసిన హంగామా నృత్యాలతో, స్టెప్పులతో దద్దరిల్లిపోయింది. అనంతరం గురువులు పూర్వ విద్యార్థులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో 20092010 పూర్వ విద్యార్థులు పజ్జు, మహిపాల్, భరత్, కిరణ్, నరసయ్య, బిన్ను, శ్రావణ్, మానస, రమ్య, రాణి, సంగీత, హారిక, నాని, సోనీ(కావ్య), చిన్ని, హరీష, తదితరులు పాల్గొన్నారు.

## పేటలో పోలీస్ యాక్ట్ అమలు

నారాయణపేట,విశాలభారతి



నారాయణపేట జిల్లాలో జూన్ 1 నుండి జూన్ 30 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలు, యువజన, రైతు, కార్మిక తదితర సంఘాల నాయకులు పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, బహిరంగ సభలు నిర్వహించరాదని చెప్పారు.ఎవరైనా పోలీస్ యాక్ట్ అమలును అతిక్రమించి కార్యక్రమాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఘనంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలభారతి,అడ్డగూడూర్:



మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం అరాటపడే వ్యక్తి రాజగోపాల్ రెడ్డి అని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తమ పదవులను త్యాగం చేసిన వ్యక్తులు కోమటిరెడ్డి బ్రదర్స్ అని కొనియాడారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ క్యాడర్ ను కాపాడేదే కోమటిరెడ్డి సోదరులని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వల్లంభట్ల రవీందర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాచకొండ రమేష్,లక్ష్మీదేవికాల్వ మాజీ సర్పంచ్ నారగోని అంజయ్య గౌడ్, గూడెపు పాండు, కప్పల రాజేష్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి, గూడెపు నాగరాజు, మారిశెట్టి మల్లేష్, షకీల్, మోర్రి శ్రీనివాస్ యాదవ్,రాచకొండ సతీష్, ప్రవీణ్, మాజీ సర్పంచ్ యేసు రత్నం, బిక్షం రెడ్డి, కమ్మంపాటి కుమార్, లింగస్వామి, నవీన్, యూత్ కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 3 నుంచి 16 వరకు
## భూ భారతి రెవెన్యూ సదస్సులు

- భూమి సమస్యల పరిష్కారానికి అవకాశంగా చేసుకోవాలని రైతులకు సూచన

విశాలభారతి,భీమదేవరపల్లి:



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక భూభారతి కార్యక్రమంలో భాగంగా భూమికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఈ మేరకు భీమదేవరపల్లి తహసీల్దార్ రాజేష్ వివరాలు తెలిపారు. జూన్ 3 నుంచి 16 భీమదేవరపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుల తేదీలు జూన్ 3 న, భీమదేవరపల్లి హైస్కూల్ జూన్ 4 న, కొప్పూరు స్కూల్ జూన్ 5, గట్ల నర్సింగపూర్ రైతు వేదిక, జూన్ 6 కొత్తకొండ, ముత్తారం స్కూల్, జూన్ 10న మల్లారం హైస్కూల్, జూన్ 11 మాణిక్యపూర్ హైస్కూల్, జూన్ 12 ముల్కనూర్ రైతు వేదిక, జూన్ 13 ముస్తఫాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం, జూన్ 14 కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం, జూన్ 15 రత్నగిరి గ్రామపంచాయతీ కార్యాలయం, జూన్ 16వంగర గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ, ఈ సదస్సుల్లో రైతుల నుండి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించబడతాయని చెప్పారు. పట్టాదారు పేరు సవరణ, భూమి స్వభావం మార్పు, సాద బైనామాల్లో భూములు కొనుగోలు చేసినట్లు రికార్డులు, వారసత్వ హక్కుతో పట్ల మార్పిడి వంటి భూమికి సంబంధిత దరఖాస్తులు ఈ సందర్భంగా ఇవ్వవచ్చని తెలిపారు. రైతులు తమ సమస్యలను సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందవచ్చని సూచించారు.

# పేట జిల్లా వాసులకు గమనిక

నారాయణపేట,విశాలభారతి:



గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రస్తుతం నారాయణపేట కూరగాయల మార్కెట్ సమీపంలో నడుస్తున్న ప్రభుత్వ జనరల్ దవాఖాన భవనం దెబ్బతిన్నది.ఈ విషయాన్ని ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు ధ్రువపరిచారు. కావున ప్రజల భద్రతా,సంక్షేమం దృష్ట్యా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఉన్నత అధికారుల ఆదేశాలతో కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న నారాయణపేట ప్రభుత్వ జనరల్ దవాఖానను అప్పక్ పల్లి సమీపంలో హైదరాబాద్ రోడ్డు ప్రక్కన నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీ భవన సముదాయంలోకి మార్చబడింది.కావున ఆదివారం నుండి ఎమర్జెన్సీ,క్యాజువలిటీ,ICU మరియు సోమవారం ఉదయం నుండి ఔట్ పేషంట్స్,ఇన్ పేషంట్స్ సేవలు అప్పక్ పల్లి సమీపంలో మెడికల్ కాలేజీ భవన సముదాయంలో అందించబడును. గర్భిణి స్త్రీలు, మరియు చిన్నపిల్లల సేవలు మంగళవారం ఉదయం నుండి అప్పక్ పల్లి సమీపంలోని ప్రభుత్వ జనరల్ వైద్యశాలలో అందించబడును.పాత భవనం నుండి కొత్త భవనంలోకి మార్పు దృష్ట్యా మంగళవారం ఉదయం నుండి కొన్ని రోజులు ఆపరేషన్స్ అవసరమైన వారికి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ మహబూబ్ నగర్ కు రెఫర్ చేయబడును.ప్రజల భద్రతా,సంక్షేమం దృష్ట్యా తీసుకున్న ఈ మార్పులను గమనించి ప్రజలు సహకరించవలసినదిగా వారు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలు – అర్హులకు లేవా? కాంగ్రెస్ కార్యకర్తలకేనా?

- అర్హుల ఎంపికలో రాజకీయ ప్రమేయం స్పష్టం
- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడిపెల్లి పృథ్వీరాజ్

విశాలభారతి,భీమదేవరపల్లి:



ఇందిరమ్మ ఇండ్లు,రాజీవ్ యువ వికాసం రుణాల వంటి సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందాలన్న ఉద్దేశంతో రూపొందించాయా? లేకపోతే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ఈ పథకాల లబ్ధి పరిమితమా? అంటూ భాజపా పార్టీ సిద్ధిపేట జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ ప్రశ్నించారు. భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పుడు అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య లబ్ధిదారుల ఎంపికలో తేడా ఏమాత్రం లేదని ఆరోపించారు. సంక్షేమ పథకాలను నిజమైన అర్హులకు అందించాల్సిన సమయంలో, మండలంలోని 24 గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల సూచనల మేరకే లబ్ధిదారుల ఎంపిక జరగడం దురదృష్టకరమన్నారు. "నిజమైన పేదలకు మొండి చేయి చూపుతూ, రాజకీయంగా అనుకూలులకే ప్రయోజనం కల్పించడమే నేటి ప్రభుత్వం విధానంగా మారింది" అని తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ 'ఇది ప్రజా ప్రభుత్వం' అని ప్రకటించుతున్నా, ప్రజల పట్ల న్యాయం జరగడం లేదని ఆయన విమర్శించారు. ఈ పరిస్థితిని రాష్ట్ర మంత్రి వెంటనే పరిగణలోకి తీసుకుని, లబ్ధిదారుల ఎంపికపై పునః సమీక్ష చేపట్టాలని భాజపా పార్టీ తరపున డిమాండ్ చేశారు.

## డబ్ల్యూహెచ్ఆర్ఏ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా సిద్దు నియామకం

- హన్మకొండ జిల్లా జర్నలిస్టుకు ప్రతిష్టాత్మక బాధ్యత

విశాలభారతి,భీమదేవరపల్లి:



ప్రపంచ మానవ హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీలో భీమదేవరపల్లి మండలానికి చెందిన హన్మకొండ జిల్లా వర్కింగ్ జర్నలిస్టు అప్పని సిద్ధూ సిద్ధేశ్వర్‌ను రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ గా (యువజన విభాగం) ఆధ్వర్యంలో నియమించారు. ఈ మేరకు వరల్డ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ చైర్మన్ ఎం.డి. సుబ్బారెడ్డి అధికారిక ప్రకటన విడుదల చేశారు. మానవ హక్కుల పరిరక్షణలో చురుకైన పాత్ర పోషిస్తున్న సిద్ధూ, యువతలో హక్కులపట్ల అవగాహన పెంపొందించే దిశగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ నియామకం వారికి మరింత బాధ్యతను కల్పిస్తుందని, సమాజంలో మానవ హక్కుల విలువలను చాటిచెప్పేందుకు పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.



# యువత అడుగులు కాంగ్రెస్ వైపు

- మాజీ ఎంపీపీ కటికం ఆశా రమేష్

గరిడేపల్లి,విశాలభారతి:

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామ యువత టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ కటకం ఆశారమేష్ ఆధ్వర్యంలో యువతను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు గత ప్రభుత్వంలో జరగని అభివృద్ధిని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చూసి యువత మరియు మహిళలు పార్టీలోకి రావడం సంతోష వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో పొనుగోడు గ్రామ పార్టీ అధ్యక్షులు నేలపట్ల వెంకటేశ్వర్లు కటికం వేణు కటికం గోపయ్య వనపర్తి గురువయ్య రెడ్డిపల్లి సైదులు చామకూరి గురుస్వామి మంగ ప్రభాకర్ మచ్చ సతీష్ బంటు సరిత ఎస్ కే సైదులు వెంకన్న సందీప్ సైదులు పాల్గొన్నారు



# ఆరోగ్యమే మహాభాగ్యం

తొర్రూరు,విశాలభారతి:

యతి రాజారావు పార్క్ ఫ్రెండ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు తొర్రూర్ లోని యతి రాజారావు పార్క్ ఫ్రెండ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గౌరవ అధ్యక్షులు డాక్టర్ వింజమూరి సుధాకర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగింది అధ్యక్షులుగా కత్తి రవీందర్, కార్యదర్శి ఎప్పటి నాగిరెడ్డి, కోశాధికారి రాములు ఎన్నుకోవడం జరిగింది. యతి రాజారావు వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా టీ షర్టు దాత ప్రముఖ రియాల్టర్ బొమ్మన బోయిన రాజేందర్ విచ్చేసి నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం వాకర్స్ అసోసియేషన్ 80 టీ షర్టులను ప్రముఖ రియాల్టర్ బొమ్మనబోయిన రాజేందర్ వాకర్స్ అసోసియేషన్ కు వితరణ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నడక అనేది ప్రతి ఒక్కరికి అవసరం పొద్దున్నే వాకింగ్ చేయడం వలన హెల్దీగా ఉంటారని అన్నారు అనంతరం రాజేందర్ ను వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు కత్తి రవీందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పొద్దున్నే ఒక గంట వ్యాయామం చేయాలని తద్వారా వారి యొక్క ఆరోగ్యానికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు వెరైటీ యాకూబ్ రెడ్డి,బొంపల్లి సోమేశ్వరావు,బాలాజీ, రాయిశెట్టి వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరుమాండ్ల రవి గౌడ్, ఉపాధ్యక్షులు కిన్నెర యాకయ్య, బోలగాని మహేష్ గౌడ్, సెక్రటరీ నూతన కంటి మంగమ్మ, కమిటీ సభ్యులు మిట్టకోల లక్ష్మణ్, బుచ్చిబాబు,వేణు,రాయిశెట్టి ఉపేందర్,కిరణ్,మహేష్, శ్రీకాంత్, రమేష్, నిమ్మల వెంకన్న, శ్రీధర్,సంపత్,యాకయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు..



## యూత్ అధ్యక్షుడిగా ఆకుల సంతోష్ గౌడ్ నియామకం

దేవరుప్పల,విశాలభారతి:

మండలకేంద్రంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న ఆధ్వర్యంలో దేవరుప్పుల గ్రామ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఆకుల సంతోష్ గౌడ్ ను ఎన్నుకున్న మండల,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆకుల సంతోష్ గౌడ్ ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు.ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యువజన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

మద్దూర్,విశాలభారతి:

మద్దూర్ మండలం నాగంపల్లి గ్రామానికి చెందిన జోగు లవకుమార్ వయసు 25 సంవత్సరాలు ఉదయం 6:30 గంటలకు తన గ్రామం నుంచి మద్దూర్ కు బైక్ పై వెళ్తుండగా మార్గమధ్యలో శ్రీ సిద్ధి వినాయక గ్యాస్ గోదాం దగ్గర ఎదురుగా వస్తున్న లారీ ఢీకొని తలకు బలమైన గాయాలు అవడం వలన అక్కడికక్కడే చనిపోయాడు. మృతుని యొక్క తల్లి జోగు అనంతమ్మ యొక్క ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ మహమ్మద్ ఆదిల్ భాష పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడమైనదని ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.



## వర్ పేజ్‌పై శ్రీలీల కవ్వింపులు

తెలుగు సినిమా ఇండస్ట్రీలో 'పెళ్లి సందడి' సినిమాతో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ శ్రీలీల. తెలుగు మూలాలు ఉన్న తెలుగు అమ్మాయి కావడంతో శ్రీలీలకు టాలీవుడ్‌లో పెద్ద సినిమాల్లో నటించే అవకాశాలు రాకపోవచ్చు అని అంతా అనుకున్నారు. కానీ శ్రీలీల తెలుగు అమ్మాయి అయినప్పటికీ పుట్టి పెరిగింది ఎక్కువ శాతం బయట రాష్ట్రాల్లో కనుక లక్కీగా ఆమెకు తెలుగు అమ్మాయి అనే ముద్ర పడలేదు. దాంతో టాలీవుడ్‌లో టాప్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కుతున్నాయి. గత ఏడాది ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబుతో కలిసి గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా నిరాశ పరచినా శ్రీలీలకు క్రేజ్ పెరిగింది.ధమాకా విజయంతో శ్రీలీల చాలా సినిమా ఆఫర్లు సొంతం చేసుకుంది. టాలీవుడ్‌లో ఒకానొక సమయంలో ఏకంగా అర డజను సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. ఇప్పటికి ఇప్పుడు కూడా శ్రీలీల చేతిలో ఏకంగా మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. ఇటీవల కోలీవుడ్ నుంచి కూడా ఆఫర్‌ను సొంతం చేసుకుంది. సినిమాలతో చాలా బిజీగా ఉండే శ్రీలీల మోడలింగ్ పై ఆసక్తితో ఫోటో షూట్స్‌తో సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్‌కి ఫుల్ కిక్ ఇస్తూ ఉంటుంది. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ ఎల్లి కవర్ పేజ్ పై ఎక్కింది. ఎల్లి మే 2025 ఎడిషన్ కవర్ పేజీ పై శ్రీలీల చాలా అందంగా కనిపిస్తుంది. కవర్ కి అందం తెచ్చిందని, ఎంతో మంది హీరోయిన్స్ కవర్ ఫోజ్‌లు ఇచ్చినా శ్రీలీల ఫోటోలు చాలా స్పెషల్ అన్నట్లుగా టాక్ వినిపిస్తుంది. ఎల్లో డ్రెస్‌లో కవ్వించే విధంగా చూస్తూ సింపుల్ అండ్ స్వీట్ మేకోవర్‌తో భలే ఉంది అంటూ శ్రీలీల కవర్ స్టిల్‌ను ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. అందమైన శ్రీలీల ఈ కవర్ ఫోటోలో మరింత అందంగా కనిపిస్తోంది అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. డాక్టర్ చదివిన శ్రీలీల తల్లి బెంగళూరులో గైనకాలజిస్ట్ అనే విషయం తెల్సిందే. తల్లి ఆదర్శంగా శ్రీలీల డాక్టర్ కావాలని అనుకుంది. కానీ అనూహ్యంగా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కించుకున్నప్పటికీ తన వైద్య విద్యను మధ్యలో వదిలి వేయకుండా పూర్తి చేసింది. హీరోయిన్‌గా బిజీగా ఉన్న సమయంలోనే శ్రీలీల ఎంబీబీఎస్ పరీక్షలు పూర్తి చేసింది. పుష్ప 2 సినిమాలో శ్రీలీల చేసిన ఐటెం సాంగ్ పాన్ ఇండియా రేంజ్‌లో సూపర్ హిట్ అయింది. కిస్సిక్ అంటూ సాగే శ్రీలీల ఐటెం సాంగ్‌కి మంచి స్పందన దక్కింది. ప్రస్తుతం ఈమె తమిళ్‌లో చేస్తున్న పరాశక్తిపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఆ సినిమాలో శివ కార్తికేయన్‌కి జోడీగా నటిస్తున్న విషయం తెల్సిందే. హిందీలో హౌస్ ఫుల్ 5 లో కీలక పాత్రలో కనిపించబోతుంది. పుష్ప 2 సినిమాలో ఐటెం సాంగ్ చేసి సూపర్ హిట్ అయిన కారణంగానే శ్రీలీల ఒక్కసారిగా టాప్ స్టార్‌గా, పాన్ ఇండియా స్టార్‌గా మారి వరుసగా పెద్ద సినిమాల్లో, ఇతర భాషల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటూ ఉంది. తెలుగులో ఈమె త్వరలో మాస్ జాతర సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది.



## కేతికా పాప.. ట్రాక్ లోకి వచ్చినట్లేనా

కేతికా శర్మ టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేయడానికి ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. 2016లో 'రొమాంటిక్' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ, తన గ్లామర్, నటనతో అభిమానులను ఆకర్షించింది. 'రంగ రంగ వైభవంగా', 'లక్ష్య' సినిమాల్లో కూడా నటించినప్పటికీ, ఆమె కెరీర్ ఊహించిన స్థాయిలో ఊపందుకోలేదు. చాలా కాలంగా స్టార్ హీరోయిన్ గా క్రేజ్ ఆదుకోవాలని చూస్తున్న కేతికాకు సరైన అవకాశాలు రాక, కెరీర్‌లో ఒడిదొడుకులు ఎదుర్కొంది. అయితే, ఇటీవల ఆమె కెరీర్‌లో కొత్త మలుపు చోటుచేసుకుంది.కేతికా నటించిన 'సింగిల్' సినిమా మే 9 విడుదలై బాక్సాఫీస్ వద్ద హిట్ టాక్ తెచ్చుకుంది. శ్రీ విష్ణు సరసన నటించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో ఆమె నటన, గ్లామర్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సినిమా రూ. 25 కోట్ల గ్రాస్‌తో రెండో వారంలోనూ బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. ఈ సక్సెస్‌తో కేతికా మరోసారి దర్శక నిర్మాతల దృష్టిని ఆకర్షించింది, ఆమె కెరీర్‌లో కొత్త ఊపిరి లభించినట్లు కనిపిస్తోంది. లేటెస్ట్ గా కేతికాకు మాస్ మహారాజ్ రవితేజ నటిస్తున్న నెక్స్ట్ సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం దక్కింది. 'అనార్కలి' టైటిల్‌తో రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కేతికా తో పాటు మరో హీరోయిన్ కూడా రవితేజ సరసన నటించనున్నట్లు టాక్. సినిమాను కిషోర్ తిరుమల డైరెక్ట్ చేయనున్నాడు. ఈ అవకాశం కేతికా కెరీర్‌లో కీలక మలుపుగా మారనుందని అంటున్నారు. రవితేజతో సినిమా అవకాశం దక్కడం కేతికాకు టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన నటించే అవకాశాన్ని తెచ్చిపెట్టింది. ఈ సినిమా షూటింగ్ జూన్ లో మొదలవనుంది, అలాగే చిత్రంలో కేతికా పాత్ర స్టైలిష్ లుక్‌తో ఆకర్షణీయంగా ఉంటుందని టాక్. ఈ సినిమా కోసం ఆమె ఇప్పటికే సన్నాహాలు మొదలుపెట్టింది, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆమె కసిగా ఉన్నట్లు సమాచారం. 'సింగిల్' సినిమా సక్సెస్ తర్వాత కేతికా కాన్ఫిడెన్స్ రెట్టింపు అయింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి మార్కులు పడటంతో, వరుస అవకాశాలు వస్తున్నాయి. రవితేజ సరసన నటించే అవకాశం ఆమె కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. మొత్తంగా, కేతికా శర్మ కెరీర్ ఇప్పుడు సరైన ట్రాక్‌లోకి వచ్చినట్లు కనిపిస్తోంది. ఇక రాబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద అమ్మడికి ఎలాంటి ఫలితాలను ఇస్తాయో చూడాలి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.